క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు



సుజాతనగర్‌లో పూజలందుకుంటున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్లోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు కనకదుర్గమ్మకు సారె సమర్పణ



పెందుర్తి: సౌభాగ్యరాయపురం(ఎస్ఆర్ పురం)లో కొలువుదీరిన కనకదుర్గమ్మ మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి భారీ ఎత్తున సారె ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులంతా వేడుకలో పాల్గొనాల్సిందిగా కోరారు.

చదువుతూ.. ఆటలాడుతూ..



లెమన్ అండ్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథలను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ భాషలో మెళకువలు నేర్పించారు. లెమన్ అండ్ స్పూన్ ఆట ఆడించారు. పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కి 143 మంది హాజరు



క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత అభ్యర్థులను కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 277 మంది అభ్యర్థులకు 143 మంది హాజరయ్యారు. అభ్యర్థులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష హాల్‌లోకి పంపారు. అభ్యర్థులకు తగిన సౌకర్యాలు సమకూర్చారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్



రైల్వే స్టేషన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

అగనంపూడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం – 4లో స్వచ్ఛ భారత్, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్ఆర్‌సీసీ సభ్యుడు కుంచుమూర్తి ఈశ్వర్, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాల్లో ప్రయాణికులకు పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. దువ్వాడ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.జాషువా, బి.కామేశ్వరరావు, ఆర్.రవి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కె.వీ.సుబ్బరాజు, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, స్పందన చేయూత ఫౌండేషన్, మానవ వికాశ వేదిక, మానవతా, సాయి సేవా సమితి నుంచి సుందరమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న 250 మందికి మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.



ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో రక్త దాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సీఐ సతీష్‌కుమార్



దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి ఉచితంగా మందులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధి శ్రీనివాస్



నిరాశ్రయులకు రగ్గులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఆహారం, ఆరోగ్యం.. సాయి మార్గం

'అభాగ్యుల పట్ల వాత్సల్యాన్ని చూపించాలి. పేదల సేవను మించిన భగవదారాధన మరొకటి లేదు' యువతనుద్దేశించి స్వామి వివేకానందుడు చెప్పిన మాట. ఆ మాటను అక్షరాలా వంటబట్టించుకున్నారు పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ మిత్ర బృందం. నిత్యం అభాగ్యుల సేవలో తరిస్తూ, ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. పెందుర్తి కేంద్రంగా దశాబ్దం క్రితం ప్రారంభమైన వీరి సేవలు ప్రస్తుతం నగర వ్యాప్తంగా కొనసాగుతున్నాయి.

అభాగ్యుల సేవలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్

నిత్యం సేవా కార్యక్రమాలతో ట్రస్ట్ సభ్యుల ఆదర్శం

పెందుర్తి కేంద్రంగా దశాబ్దంగా సేవలు



అవయవదానంపై ట్రస్ట్ ఆధ్వర్యంలో పెందుర్తిలో అవగాహన ర్యాలీ

ట్రస్ట్ సమకూర్చిన ఉచిత అంతిమ యాత్ర వాహనం



పెందుర్తి: పేద ప్రజలకు అవసరమైన ఆహారం, వైద్య సేవలు అందిస్తూ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రజా సేవ చేస్తున్నారు. అవయ దానంపై అవగాహన కలిగిస్తున్నారు. మరణించిన వ్యక్తుల నుంచి నేత్రాలు సేకరించి చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. నిరుపేదలు మరణిస్తే ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని ట్రస్ట్ తరఫున అంతిమయాత్ర వాహనాన్ని సమకూర్చి అండగా నిలుస్తున్నారు. దశాబ్ది కాలంగా వేల మందికి సాయపడుతూ పెందుర్తి పరిసర ప్రజల ప్రశంసలందుకుంటున్నారు.

ఒక్కరితో ఆరంభం..

పెందుర్తిలోని సాయిరాం మెడికల్స్ అధినేత దాడి శ్రీనివాస్ అభాగ్యుల సేవలో ఆది నుంచీ తనకు తోచిన రీతిలో ముందుండేవారు. తనతో పాటు మరికొంత మంది కలిస్తే పేదలకు మరింత సేవ చేయొచ్చన్న సంకల్పంతో 2016లో 20 మందితో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ పేరిట ఓ సంస్థను స్థాపించారు. ఈ ట్రస్ట్ కోసం ముందుగా సభ్యులే తలో కొంత మొత్తాన్ని సమకూర్చుకున్నారు. ఆ నిధులతో నెలలో కనీసం రెండుసార్లు ఏదో ఒక సేవా కార్యక్రమం నిర్వహించేవారు. ఈ క్రమంలో దాతలు కూడా ట్రస్ట్‌కు తమ వంతు సహకారాన్ని అందించడం మొదలయింది. ట్రస్ట్ పనితీరు రోజురోజుకూ మెరుగవ్వడంతో అధిక సంఖ్యలో దాతలు ట్రస్ట్ సేవల్లో భాగస్వాములవుతున్నారు.

ఆహారం.. ఆరోగ్య సేవల్లో మేటి

అభాగ్యులకు కావాల్సిన ప్రాథమిక అవసరాలు ఆహారం, ఆరోగ్యం. అందుకే ట్రస్ట్ వీటిపైనే దృష్టి సారించింది. ఈ క్రమంలోనే గ్రామాల్లో కనీసం నెలకు ఒకటి చొప్పున సాధారణ వైద్య శిబిరం, నేత్ర వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. నెలలో రెండుసార్లు నగరంలోని రోడ్డు పక్కన ఉండే అభాగ్యులకు, అనాథాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ఆహారం అందిస్తున్నారు. వృద్ధాశ్రమాల్లో స్వచ్ఛ భారత్, వృద్ధులకు ట్రస్ట్ ప్రతినిధులే కేశఖండన తదితర సేవలు చేయడం అదనం.

అవయదానంపై అవగాహన

'మరణించిన తరువాత కూడా జీవించండి' అనే నినాదంతో ప్రజల్లో అవయదానంపై చైతన్యం తీసుకువస్తున్నారు. అఖిల భారత అవయదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడురు సీతామహాలక్ష్మి సూచనలతో ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. ముందుగా ట్రస్ట్ సభ్యులంతా అవయవదానానికి అంగీకారం తెలిపి, ఆదర్శంగా నిలిచారు. ఏడాది కాలంలో దాదాపు 100 మందికి పైగా అవయవదానంపై తమ అంగీకారం తెలిపేలా ట్రస్ట్ ప్రతినిధులు ప్రోత్సహించారు. అంతేకాకుండా మరణించిన వ్యక్తుల సమాచారం తెలిసిన వెంటనే అక్కడికి వెళ్లి, వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలు సేకరిస్తున్నారు.

ట్రస్ట్ అందిస్తున్న సేవల్లో కొన్ని..

- సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ ప్రతీ నెలా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ముగ్గురికి తన సొంత నిధులతో అవసరమైన మందులు అందిస్తున్నారు.
- ట్రస్ట్ తరఫున 100కు పైగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేలాది మందికి వైద్య సేవలు అందించారు. దాదాపు 500 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు చేయించారు.
- **ఇప్పటివరకు 35** రక్తదాన శిబిరాల ద్వారా **సుమారు 2 వేల** యూనిట్ల రక్తం సేకరించి, **అవసరమైన వారికి** అందించారు. 10 లక్షల **మందిలో ఒక్కరికి ఉండే** 'బాంబే'బ్లడ్ గ్రూప్‌ను **కూడా ఇటీవల ట్రస్ట్** తరఫున సమకూర్చడం **విశేషం.**
- **అంతిమ యాత్ర** వాహనాలను రెండింటిని **సమకూర్చి అనాథ,** నిరుపేద మృతదేహాల అం**తిమ యాత్ర నిర్వహణ**కు తమ వంతు సాయ**పడుతున్నారు.**



లయోలా వృద్ధాశ్రమంలో వృద్ధులకు క్షౌరసేవ చేస్తున్న ప్రతినిధులు

ఉచిత అంబులెన్స్ సేవల దిశగా..



చిన్నప్పటి నుంచి పేదలకు నావంతు సాయం చేయాలన్న తపన ఉండేది. తొలుత ఆర్థిక పరిస్థితి వల్ల ఆశించినంతగా చేయలేకపోయా. ఇప్పుడు దేవుడి దయ, దాతల సహకారం తోడైంది. మేమంతా టీం వర్క్‌తో ముందుకు సాగుతూ పేదలకు మా వంతు సేవలందిస్తున్నాం. భవిష్యత్‌లో మా ట్రస్ట్ సేవలు మరింతగా విస్తృతం చేసేందుకు ప్రయత్నిస్తాం. ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి, ఉచిత సేవలందించాలని ఆకాంక్ష.

– దాడి శ్రీనివాస్, సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న 1995-96 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలను వేదికగా చేసుకుని ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం వారు స్థిరపడిన వృత్తులు, కుటుంబ విశేషాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు వెల్ఫేర్ గ్రూప్‌గా ఎవరికి ఏ కష్టమొచ్చినా.. సహకరిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. పాఠశాల చదువులు వదిలి 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి, సందడిగా గడిపారు. ఫొటోలు తీసుకుని, జ్ఞాపకాలతో వెనుదిరిగారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కలపాక రహదారిలో ఓ పక్కకు వంగిన విద్యుత్ స్తంభం

పరవాడ: వెన్నలపాలెం–కలపాక రహదారిలో పలు విద్యుత్ స్తంభాలు ఓ పక్కకు వంగిపోవడంతో ఏ క్షణాన నేలకూలుతాయోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కన ఏర్పాటు చేసిన పలు హై పవర్ విద్యుత్ స్తంభాలు గతంలో కురిసిన భారీ వర్షాలకు ఓ పక్కకు ఒరిగిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వాటివైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ.. ఇంకా ఎక్కువగా వాలిపోతున్నాయి. రోడ్డు పక్కన ప్రమాదకర స్థాయిలో ఉన్న ఇలాంటి విద్యుత్ స్తంభాలతో సమీపంలో పంటలు సాగుచేస్తున్న రైతులు, రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న కార్మికులు, ఉద్యోగులు, కలపాక, స్వయంభూవరం, పిట్టవానిపాలెం గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమినాయుడుపాలెం కూడలి నుంచి పెద స్వయంభూవరం కూడలి వరకు ఉన్న విద్యుత్ స్తంభాల్లో కొన్నింటి పరిస్థితి ఇలా ఉంది. వీటిని వీలైనంత త్వరగా సరిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి పునరావాస కాలనీ దానబోయినపాలెం సీతారామాలయంలో ఆదివారం యూజు, దానబోయిపాలెం గ్రామ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని 85వ వార్డు నాయకుడు ఇల్లపు ప్రసాద్ ప్రారంభించారు. ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణుడు, ఒంగోలులోని రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్ రావ్ అత్తోట మాట్లాడుతూ ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వహించవద్దని సూచించారు. యూజ్ సంఘం వ్యవస్థాపకుడు కె.పరంధామయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఇళ్లు, భూములను త్యాగం చేసిన ఉక్కు నిర్వాసితులపై అభిమానంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎయిమ్స్ న్యూరాలజీ విభాగం డాక్టర్లు కొప్పోలు ప్రణతి, వి.సిద్ధార్థ, జి.సంధ్య, పి.సురేష్, బి.లీలాబాయి, వి.ప్రమీల, వి.గోపికృష్ణ, పద్మజ, కె.లలిత తదితరులు సేవలందించారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ఇల్లపు ప్రసాద్ తదితరులు శిబిరం ఏర్పాటు చేసిన పరంధామయ్యను సత్కరించారు.

టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు కల్పించాలి



టిడ్కో ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: మండలంలోని భానోజీతోట, దయాల్‌నగర్, బర్మా కాలనీలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో కనీస వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బర్మా కాలనీలో టిడ్కో లబ్ధిదారులతో కలసి ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడ్కో గృహాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కనీస సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను కల్పించలేదన్నారు. కనీస సౌకర్యాల్లేకుండా ఇంక్కడి ప్రజలు ఎలా జీవించగలరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆనంద్, అప్పలరాజు, భాస్కరరావు, ఖాన్, వెంకటరావు, బాషా, నాని, ధనలక్ష్మి, వైదేహి, జగదీష్ పాల్గొన్నారు.

త్వరలో వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ, అనుబంధ కమిటీలు

పార్టీ ముఖ్యనేతలతో నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలలో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. సబ్బవరంలోని స్థానిక వైఎస్సార్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల కమిటీలు, గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎంతో కొంత ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుందని, అయితే కూటమి ప్రభుత్వంపై చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏడాది పూర్తికాక ముందే పెద్ద ఎత్తున ప్రజా వ్యతిరేకత ఏర్పడటం చూస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి అనేది లేకుండా కేవలం స్వలాభం కోసం, సొంత పనులు మీదే దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. పార్టీపై అంకిత భావంతో పనిచేసిన వారికి కమిటీల్లో చోటు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, బోకం రామునాయుడు, మండల కన్వీనర్ కర్రి బాబు, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మోపాడ అప్పారావు, సర్పంచ్‌లు దెడ్డం ప్రసాదరావు, వద్దాది అప్పలరాజు, గొర్లి రాజేష్, పార్టీ నాయకులు వనం అచ్చెంనాయుడు, కాపుశెట్టి శేషుబాబు, బోను గంగునాయుడు, ఉగ్గిన గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత సత్యనారాయణకు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మాధవధార ప్రాంతానికి చెందిన పి.ఉమా వెంకట సత్యనారాయణ లక్షా 5 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయ డొనేషన్ కౌంటర్లో ఇచ్చారు. దేవస్థానం తరఫున అన్నప్రసాద విభాగం ఏఈవో ఆనంద్‌కుమార్, పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్ అందించారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సాగరతీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం దరి సముద్రంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో ఆదివారం సందడిగా మారాయి. వేసవి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, పిల్లలు, పెద్దలు తీర ప్రాంతాలకు చేరుకుని సందడి చేశారు. వేసవి తాపం, వేడి గాలులతో ఉక్కపోతకు గురై ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉపశమనం పొందేందుకు తీర ప్రాంతాలకు చేరుకుని కెరటాలతో కేరింతలు కొట్టారు. సముద్ర స్నానాలకు వెళ్లలేని వారు తీరం వెంబడి చెట్లు, వంతెనల కింద సేదదీరారు. సాయం సంధ్య వరకు ఇసుక తిన్నెలపై ఆట పాటలతో ఆనందంగా గడిపారు.

ఘనంగా భూలోకమాంబ ఆలయ వార్షికోత్సవం



భూలోకమాంబను దర్శించుకుంటున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు యాతపాలెంలో కొలువైన భూలోకమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, ప్రధాన వీధుల్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారిని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు ధర్మాల శ్రీను, పితాని అన్నవరం, సంపంగి అప్పలనాయుడు, సంపంగి ఈశ్వరరావు దర్శించుకున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



అంత్యాక్షరి ఆడుతున్న విద్యార్థులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. విద్యార్థులకు అంత్యాక్షరి, నృత్య పోటీలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానం విశ్రాంత పర్యవేక్షకుడు వి.కామేశ్వరరావు విద్య ఆవశ్యకత, గ్రంథాలయ సేవలు, వేసవి విజ్ఞాన శిబిరం ఉపయోగాలను వివరించారు. కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు విద్యార్థులకు ఇండియా మ్యాప్‌లో రాష్ట్రాలను గుర్తించే ప్రక్రియలో సులభ పద్ధతులను తెలిపారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం ఏర్పాట్లు పర్యవేక్షించారు.